ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలు తీస్తారా?

- నరసాపురంలో వైద్యుల ఆవేదన
- ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్

నరసాపురం: ప్రాణాలు పోసే వైద్యుల మాన ప్రాణాలు తీయడం దారుణమని నరసాపురం వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోల్‌కతాలో వైద్యురాలిని అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎంఏ నరసాపురం శాఖ ఆధ్వర్యంలో వైద్యులు శనివారం పట్టణంలో నిరసన తెలిపారు. వైద్య సేవలను నిలిపేసి పట్టణంలో ర్యాలీ చేశారు. అనంతరం నరసాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ ఇలపకుర్తి ప్రకాష్, డాక్టర్ బళ్ల మురళి, డాక్టర్ మాదంశెట్టి పద్మావతి, డాక్టర్ కొప్పర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ మెడికల్ కాలేజ్‌లో వైద్యసేవలు అందిస్తున్న ట్రైనీ డాక్టర్‌ను దారుణంగా అత్యాచారంచేసి చంపడం హేయమైన చర్య అన్నారు. నిందితులకు కఠిన శిక్షలు పడకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయన్నారు. ట్రైనీ డాక్టర్ హత్యాచారంపై న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణ, లింగ్ నర్సింహారావు, మాదంశెట్టి కోటేశ్వరరావు, కొప్పర్తి నరేంద్ర, శెట్టి గణేష్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి

నరసాపురం: ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి రక్షణ కల్పించే దిశగా చట్టాలను బలోపేతం చేయాలని నరసాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టర్‌గా పనిచేస్తున్న యువతిని అత్యాచారంచేసి, హత్య చేసిన ఘటనను ఖండిస్తూ శనివారం ఆసుపత్రి గేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, ఐఎంఏ, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేవారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటలు వరకు వైద్య సేవలను నిలిపేసి ఆందోళన చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ల సమ్మెకు పీఎంపీల మద్దతు

మొగల్తూరు: కోల్‌కతాలోని మెడికల్ కాలేజీలో జూనియర డాక్టర్‌పై అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దేశ వ్యాప్తంగా శనివారం డాక్టర్లు చేపట్టిన ఒకరోజు సమ్మెకు మండల పీఎంపీలు సంఘీభావం ప్రకటిస్తున్నట్లు పీఎంపీ వైద్యులు కేపీఎస్ ముక్తేశ్వరరావు, పీహెచ్ బాబ్జిలు తెలిపారు. ఐఎంఏ ఆదేశాలు మేరకు చేపట్టిన సమ్మెకు మొగల్తూరు మండలంలోని పీఎంపీల డివిజన్ సమావేశం తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా ఆదివారం ఉదయం వరకు వైద్య సేవలు నిలిపేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: కోల్‌కతాలో వైద్య విద్యార్థి పై అత్యాచారం, హత్య చేయడంపై ఆచంట నియోజకవర్గంలో నిరశన వెల్లువెత్తింది. శనివారం ఉదయం ఆచంట మండలం ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఆచంట వేమవరం, వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేసి ఆచంట కచేరి సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి ఇన్‌చార్జి తహసీల్దారు డి.సుగుణ సంధ్యకు వినతిపత్రం సమర్పించారు. దేశంలో అన్ని మెడికల్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తగు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శివరంజని, డాక్టర్లు జితేంద్ర, రమ్య శృతి, ఉమా శంకర్, రామాంజనేయులు, పావని తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో

పెనుగొండ మండలం పెనుగొండ కమ్యూనిటి హెల్త్ సెంటర్, మార్టేరు, సిద్ధాంతాలకు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో మానవహారం నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



నరసాపురం: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది



పెనుగొండ: ఆచంటలో వినతిపత్రం అందిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది



పాలకొల్లు అర్బన్: కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఐఎంఏ, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

దోషులను కఠినంగా శిక్షించాలి

పాలకొల్లు అర్బన్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరిపి, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏఎంఏ వైద్యులు డిమాండ్ చేశారు. డా.మౌమిత ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ డా.మౌమితను మానవ రూపంలో మృగాలు అత్యాచారం జరిపి హత్య చేయడం అత్యంత హేయమైన చర్యగా భావించాలన్నారు. దోషులను విచారణ పేరుతో కాలయాపన చేయకుండా తక్షణం ఉరితీయాలని డిమాండ్ చేశారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులతో పాటు రోటరీక్లబ్, లయన్స్‌క్లబ్, కాపు వనితా క్లబ్, బీజేపీ మహిళా మోర్చా, ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్, ఉల్లంపర్రు అన్నపూర్ణ నర్శింగ్ విద్యార్థినులు, జన విజ్ఞాన వేదిక, పీహెచ్‌సీ పారా మెడికల్ అసోసియేషన్, ఎన్జీవో పట్టణశాఖ ఆధ్వర్యంలో కొవ్వొతులతో భారీ ర్యాలీ నిర్వహించి డా.మౌమితకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వెంకటరమణ, కేఎస్‌పీఎన్ వర్మ, సంజయ్, మాధుర్, కల్యాణ్, గంగాధర్, స్వరూప్, నవ్యజీవన్, అడ్డాల ప్రతాప్‌కుమార్, హెన్నా, భారతి, చంద్రరేఖ తదితరులు పాల్గొన్నారు.

మానవత శాంతి ర్యాలీ



పెనుగొండలో మానవత శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రపంచ శాంతిని కోరుతూ పెనుగొండ మానవత శాఖ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. శనివారం మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెనుగొండ మానవత శాఖ, వాసవీ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవత అధ్యక్షుడు డాక్టర నల్లిమిల్లి విజయరాజు మాట్లాడుతూ ప్రతి పౌరుడూ ప్రపంచ శాంతి కోరుతూ ఐక్యతతో ముందుకు సాగుతూ, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్రి నరేంద్ర రెడ్డి, షేక మస్తాన్, యలమర్తి నరసింహారావు, నూలి నవీన్ కుమార్, పాదల సతీష, నర్సమాంబ, కొప్పిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేములదీవి వెంకన్నకు పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారిని శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమారాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ–క్రాప్ నమోదు వేగంగా పూర్తి చేయాలి

నరసాపురం రూరల్: జిల్లాలో సాగు అవుతున్న ప్రతి ఎకరాన్ని ఈ–క్రాప్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేసి సెప్టెంబర్ 20 నాటికి పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని లిఖితపూడి గ్రామంలో ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ క్రాప్ నమోదు నిబంధనలను తప్పక పాటించాలన్నారు. రైతులు సాగు చేస్తున్న పంట వివరాల నమోదుతోనే పంట సాయం, పంటల భీమా తదితర ప్రభుత్వ పథకాలు అందజేయడానికి వీలవుతుందని, ఇందుకు ఈ–క్రాప్ నమోదు తప్పని సరి అని అన్నారు. దీనిని బాధ్యతగా తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు ఏ పంటను సాగు చేస్తే అదే పంటను నమోదు చేయాలని, మరో పంట నమోదు చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. జేసీ వెంట ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్, వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు ఈదా అనిలకుమారి, తహసీల్దార్ రాజేశ్వరి, ఏఓ శామ్యూల్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు వేగవంతం

పెనుగొండ: సెప్టెంబరు 20 నాటికి ఈ–క్రాప్ నమోదు పూర్తి చేయాలని ఆచంట తహసీల్దారు డి సుగుణ సంధ్య ఆదేశించారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓ, వీఏఏ, వీహెచ్ఏల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ కమిటీ సభ్యులు, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలు కలిసి సాగుదారులను గుర్తించి ఈ పంట నమోదు చేయాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఆ గ్రామ సర్వేయర్, వీఆర్‌ఓ కలిసి జాయింట్ ఎల్‌పీఎంలను ఖాతాల వారీగా ఎంట్రీ చేయాలని తెలిపారు. ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బి.నాగరాజు మాట్లాడుతూ భూ యజమానులు, కౌలు రైతులు వేసిన పంట రకం, విత్తిన తేదీ వివరాలను త్వరతి గతిన రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయాలన్నారు.



నరసాపురం రూరల్: లిఖితపూడిలో ఈ- క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేసీ



పెనుగొండ: ఆచంట సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సుగుణ సంధ్య

మందకొడిగా ఈ-క్రాప్ నమోదు

యలమంచిలి: ఈ–క్రాప్ నమోదు కార్యక్రమం మందకొడిగా సాగుతుంది. యలమంచిలి మండలంలోని 32 గ్రామాల్లో 5120 ఎకరాలలో ఊడ్పులు కావాల్సి ఉండగా ఇంతవరకు 2112 ఎకరాలలో మాత్రమే ఊడ్పులు పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, గోదావరి వరదలకు నారుమడులు దెబ్బతినడంతో ఊడ్పులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం వ్యవసాయ అధికారులు 750 ఎకరాలలో ఈ–క్రాప్ మాత్రమే పూర్తయ్యింది.



చించినాడలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

నరసాపురం: నరసాపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోవత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొని రుస్తుంబాధ లెప్రసీ కాలనీలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరసాపురం పట్టణ, మండల, మొగల్తూరు మండలాల విలేకరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: 68 సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలపై ఏపీయూడబ్ల్యూజే ఎనలేని పోరాటం చేసిందని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబులు అన్నారు. శనివారం ఆచంట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏపీడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొని సమాజాభివృద్ధికి జర్నలిస్టులు చేస్తున్న కృషిని కొనియాడారు.

ఉచిత సుగర్ పరీక్షలు

పాలకొల్లు అర్బన్: ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకొల్లు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత సుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోలా రజనీకుమార్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలిచే పాత్రికేయులు సమాజ శ్రేయస్సుకోసం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ, సిబ్బంది శిబిరంలో పాల్గొన్న పాత్రికేయులకు, ప్రజలకు సుగర్ పరీక్షలు నిర్వహించారు.

సిద్ధమవుతున్న గణనాథులు



నాలుగు అడుగుల గణపతి ప్రతిమలు



పెనుగొండలో సిద్ధమవుతున్న గణపతి ప్రతిమలు


పెనుగొండ: వినాయక చవితి సంబరాలకు గణనాథులు సిద్ధమవుతున్నాయి. వచ్చే నెల 7న వినాయకచవితి నేపథ్యంలో విగ్రహ తయారీదారులు వేగంగా విగ్రహాలను తయారు చేస్తున్నారు. పెనుగొండ, సిద్ధాంతం వంటి ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి వీటిని తయారు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ గణపతి, కనకదుర్గమ్మ వారి ప్రతిమలను తయారు జీవనోపాధి పొందుతున్నారు. గణపతి ప్రతిమలను రెండు నెలల ముందు నుంచే సిద్ధం చేసే పనిలో కళాకారులు నిమగ్నమయ్యారు. రెండు అడుగుల నుంచి 15 అడుగుల భారీ ప్రతిమల వరకు వీటిని సిద్ధం చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేసే విగ్రహాలతో పాటు, కొందరి కోరిక మేరకు మట్టితోనూ గణపతి ప్రతిమలను సిద్ధం చేస్తున్నారు. పెనుగొండలో పీఓపీతోనూ, సిద్ధాంతంలో పీఓపీతో పాటు, మట్టి ప్రతిమలను సిద్ధం చేస్తున్నారు. భారీ విగ్రహాలను తయారీకు రాజస్థాన్ కళాకారుల నుంచి తీసుకుని, నాలుగు అడుగుల నుంచి 8 అడుగుల విగ్రహాలను మాత్రం స్థానికంగానే సిద్ధం చేస్తున్నారు. ఒక్కో తయారీ కేంద్రంలో 150 విగ్రహాల వరకు సిద్ధం చేస్తున్నారు. వీటిని రూ.2 వేల నుంచి రూ.25 వేల వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే, నానాటికి ముడిసరుకుల ధరలు పెరిగిపోయాయని, రేటు పెంచితే అమ్మకాలు సాగడం లేదని తయారీదారులు వాపోతున్నారు. ముఖ్యంగా రసాయనాలు వినియోగించకుండా, పర్యావరణ పరిరక్షణను కాపాడే విధంగా వాటర్ పెయింట్లను వినియోగించడంతో నిర్వహణా భారం పెరిగిపోతుందన్నారు. పెనుగొండలో విశ్రాంత డ్రాయింగ్ మాస్టార్ వేంద్ర చిన నరసింహమూర్తి, పాల సత్యనారాయణలు వీటిని తీర్చిదిద్దుతుండగా, సిద్ధాంతంలో ఎన్నో ఏళ్లుగా చిన బుడతయ్య మట్టి విగ్రహాలనే తీర్చిదిద్దుతూ ఆకట్టుకుంటున్నారు.



పెనుగొండలో గణనాథులను సిద్ధం చేస్తున్న కళాకారులు



15 అడుగుల ప్రతిమ



తుది మెరుగులు దిద్దుకున్న గణపతి ప్రతిమ

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

పెనుగొండ: బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసినా కఠిన చర్యలు తప్పవని పెనుమంత్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.కృష్ణకుమారి హెచ్చరించారు. శనివారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయం నిర్వహించిన సమావేశంలో బాల్య వివాహాలను నిరోధించడంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.సుగుణ సంధ్య, ఎంపీడీఓ పి.నరసింహప్రసాద్, ఈఓపీఆర్డీ టి. మూర్తి బాబు, పి.మమతా పాల్గొన్నారు.



పెనుగొండ: ఆచంటలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణకుమారి

తిల్లపూడిలో..

పాలకొల్లు అర్బన్: స్త్రీ చదువుకుంటే సమాజం బాగుపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మంగ అన్నారు. మండలంలోని తిల్లపూడిలో ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు మిషన్ శక్తి 100 కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగ మాట్లాడుతూ బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టపరంగా శిక్షను అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జేపీ నాగలక్ష్మి, సీహెచ్‌ఎస్‌వీ లక్ష్మి, కె.అన్నపూర్ణ, కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రికార్డుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న జేసీ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం జేసీ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డు రూమ్‌ను తనిఖీ చేశారు. రికార్డు రూమ్ భద్రతలో లోపాలుంటే సరిదిద్దాలని చెప్పారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనం కాబట్టి మరమ్మతులు చేయాల్సి ఉంటే నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ అచ్యుత్‌అంబరీష్‌ను ఆదేశించారు. అనంతరం ఉద్యోగులుతో మాట్లాడి వసతులు, ఇతర ఇబ్బందులపై ఆరా తీశారు.

జైలు అదాలత్ ద్వారా కూడా కేసుల రాజీ



జైలు అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్

నరసాపురం: జైలు అదాలత్ ద్వారా కూడా కేసులు రాజీ చేసుకోవచ్చని నరసాపురం అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్ సూచించారు. శనివారం జడ్జి శ్రీనివాస్ స్థానిక సబ్ జైలును తనిఖీ చేసి జైలు అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం జైలు అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. సబ్‌జైలులో ఉన్న ఖైదీల బంధువులు, న్యాయవాది ద్వారా ఫిర్యాదుదారులతో సంప్రదించి కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసులను రాజీ ద్వారా పరిష్కరించకోవడం ఉత్తమ మార్గమని సూచించారు. సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన కేసులు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. సబ్‌జైలులో ఉన్న ఖైదీలకు ఆహారం పరిశుభ్రంగా అందించాలని జైలు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, జైలు విజిటింగ్ లాయర్ టి.శిరీష, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్‌వీడీ వరలక్ష్మి, పాల్గొన్నారు.

రేపటి నుంచి సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ

మొగల్తూరు: మండలంలోని సర్పంచ్, గ్రామ కార్యదర్శులకు సోమవారం నుంచి బుధవారం వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి.బాబ్జిరాజు శనివారం విలేకరులకు తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారాలు, విధులు, బాధ్యతలు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే శిక్షణ తరగతులకు మండలంలోని 17 గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

హిందువులపై దాడిని నిరసిస్తూ కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: బంగ్లాదేశ్‌లో మైనార్టీలు, ముఖ్యంగా హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ర్యాలీ గాంధీబొమ్మల సెంటర్ నుంచి ప్రారంభమై యడ్లబజారు వరకు సాగింది. కాగడాల ప్రదర్శనలో హిందూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న, కోశాధికారి శిరం ఆనందకృష్ణ, మాంటిస్సోరీ స్కూల్ డైరెక్టర్ కృష్ణవర్మ, జక్కంపూడి కుమార్, రఘు, చెరుకూరి శ్రీనివాస్, ధనాని సూర్యప్రకాష్, తులా రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఎం నేత నేత్రాలు, శరీరం దానం

యలమంచిలి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘ (యూటీఎఫ్) వ్యవస్థాపక సభ్యుడు, రైతు సంఘ నేత, సీపీఎం నాయకుడు వలవల శ్రీరామమూర్తి (90) శనివారం మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీరామమూర్తి రాజమండ్రిలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన స్వగ్రామం యలమంచిలి మండలం నారినమెరక కాగా ఉద్యోగ విరమణ తరువాత ఆయన పాలకొల్లులో స్థిరపడ్డారు. అయితే మరణం తరువాత కూడా తన శరీరం మట్టిపాలు కాకూడదని భావించి నేత్ర దానంతో, శరీర దానం చేస్తానని గతంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శ్రీరామమూర్తి నేత్రాలను నిడదవోలు ఐ బ్యాంకు సిబ్బంది స్వీకరించగా, శరీరాన్ని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి దానం చేశారు. శ్రీరామమూర్తి మరణవార్త తెలుసుకున్న పలు సంస్థల, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీకి మృత దేహం వద్ద నివాళులర్పించారు.